ప్రకృతి పండగ..ఆనందాలు నిండుగ

బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు

- 174 ప్రాంతాల్లో కృత్రిమ కొలనులు
- 4వేల హైమాస్ట్‌ దీపాల ఏర్పాట్లు
- లష్కర్‌కు చేరిన పండగ చీరలు



సికింద్రాబాద్‌: సికింద్రాబాద్‌ సర్కిల్‌ పరిధిలో బతుకమ్మ వేడుకల కోసం జీహెచ్‌ఎంసీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంజినీరింగ్‌, అర్బన్‌ కమ్యూనిటీ అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో పండగ ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకున్నారు. ఈ మేరకు ఇరు విభాగాల అధికారులు, పర్యవేక్షకులతో జీహెచ్‌ఎంసీ అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించారు. పలు ప్రతిపాదిత అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయించిన అధికారులు త్వరలో పనులు ప్రారంభించేందుకు సమాయత్తం అవుతున్నారు. ఒకటి రెండు రోజుల్లో పనులు ప్రారంభించి వారం రోజుల్లో పూర్తిచేసేందుకు సమాయత్తం అవుతున్నారు.

కృత్రిమ కొలనుల కోసం రూ.11.50 లక్షలు

- నియోజకవర్గంలోని ఐదు డివిజన్లలో 174 ప్రాంతాల్లో బతుకమ్మ వేడుకలు నిర్వహించుకునేందుకు వీలుగా మైదానాలు ఏర్పాటు చేయనున్నారు. అదే ప్రాంతాల్లో బతుకమ్మలు నిమజ్జనం చేసేందుకు కృత్రిమ చెరువులను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందు కోసం రూ.11.50 లక్షల నిధులు కేటాయించారు. కృత్రిమ కొలనుల నిర్మాణం, అందులో నీటిని నింపడం, వేడులకు పూర్తయ్యాక తొలగించడం వంటి కార్యక్రమాల కోసం ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించారు.
- ఈనెల 22 నుంచి ఐదు రోజుల పాటు బతుకమ్మ ఆటలు పాటల పోటీలను మహిళలకు నిర్వహిస్తారు. రోజుకు ఒక డివిజన్‌ చొప్పున ఐదు డివిజన్లలో ఐదు రోజులపాటు నిర్వహిస్తారు. ఇందులో ఆటలు, పాటలకు సంబంధించి విజేతలైన మహిళలను ఎంపిక చేసి బహుమతులు ప్రదానం చేయనున్నారు.

4 వేల హైమాస్ట్‌ లైట్లు

బతుకమ్మ వేడుకలు నిర్వహించే ప్రాంతాలు కాంతివంతంగా ఉండేందుకు హైమాస్ట్‌ విద్యుత్‌ దీపాలను ఏర్పాటు చేస్తున్నారు. బతుకమ్మ వేడుకలు జరిగే తీరును, హాజరయ్యే మహిళలను బట్టి ఏఏ ప్రాంతాల్లో ఎన్ని విద్యుత్‌దీపాలు బిగించాలన్న ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. 174 కృత్రిమ కొలనులు ఏర్పాటు చేసిన ప్రాంతాలు, ప్రధాన కూడళ్లు కలుపుకుని మొత్తంగా 4210 విద్యుత్‌ హైమాస్ట్‌ విద్యుత్‌ దీపాలు ఏర్పాటు చేస్తున్నారు. అందుకోసం రూ.19 లక్షల నిధులకు అధికారులు కేటాయించారు. ఒకటి రెండు రోజుల్లో విద్యుత్‌ దీపాల బిగింపు కాంట్రాక్టును ఖరారు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

జంక్షన్లలో భారీ బతుకమ్మల

డివిజన్‌కు ఒకటి చొప్పున ఐదు మున్సిపల్‌ డివిజన్లలో ఐదు భారీ బతుకమ్మ నమూనాలను వారం రోజుల పాటు సందర్శన కోసం ఏర్పాటు చేయనున్నారు. సద్దుల ఎంగిలిపూల బతుకమ్మ నుంచి సద్దుల బతుకమ్మ వరకు డివిజన్‌లోని ప్రధాన సర్కిల్‌లో బతుకమ్మ నమూనాను ఏర్పాటుచేసి, చుట్టూరా కనువిందు చేసే విద్యుత్‌ దీపాలు ఏర్పాటు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. తార్నాక, అడ్డగుట్ట, మెట్టుగూడ, పార్శిగుట్ట, చిలకలగూడ జంక్షన్లలో భారీ బతుకమ్మలను ఏర్పాటు చేయనున్నారు.

లష్కర్‌కు చేరిన బతుకమ్మ చీరలు

బతుకమ్మ వేడుకలు సందర్భంగా ఈమారు స్వయం సహాయక బృందాలకు చెందిన మహిళలకు మాత్రమే బతుకమ్మ చీరులు అందించే ఏర్పాట్లు చేస్తున్నారు. నియోజకవర్గంలో 2700 మహిళా స్వయం సహాయక బృందాలు ఉన్నాయి. ఇందులో సభ్యులుగా ఉన్న 21,600 మంది మహిళలకు చీరలు అందించాలని అధికారులు నిర్ణయించారు. ఇప్పటికే 15 వేల వరకు చీరలు దిగుమతి చేసుకున్న జీహెచ్‌ఎంసీ అధికారులు లాలాపేటలోని స్పోర్ట్స్‌ స్టేడియంలో భద్రపరిచారు. మిగతా చీరలు అందగానే వార్డు కార్యాలయాల్లో పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

'గాంధీ'లో సమస్యలు పరిష్కరించాలి



గాంధీ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న పీవైఎల్‌ ప్రతినిధులు

గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్‌ గాంధీఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రోగ్రెసివ్‌ యూత్‌ లీగ్‌ (పీవైఎల్‌)ప్రతినిధులు డిమాండ్‌ చేశారు. ఈమేరకు పీవైఎల్‌ గ్రేటర్‌ హైదరాబాద్‌ అధ్యక్షుడు బీఎస్‌ కృష్ణ నేతృత్వంలో ప్రతినిధుల బృందం గాంధీ ఆస్పత్రి పాలనా యంత్రాంగంతో సోమవారం భేటీ అయ్యారు. గాంధీలో క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి ధర్నా నోటీసులు అందించామన్నారు. గాంధీ సూపరింటెండెంట్‌ ప్రొఫెసర్‌ వాణి, డిప్యూటీ సునీల్‌కుమార్‌, ఆర్‌ఎంఓ-1 శేషాద్రి, పీవైఎల్‌ ప్రతినిధులు రవికుమార్‌, బీఎస్‌ కృష్ణ, భీమేష్‌, కిరణ్‌, బాలు, మల్లేష్‌, ప్రకాశ్‌, శంకర్‌, రాజు, సురేష్‌లు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



చెస్‌ విజేతలకు బహుమతులు అందజేస్తున్న బండ కార్తీక చంద్రారెడ్డి

లాలాపేట: యువత క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తీకచంద్రారెడ్డి అన్నారు. ఈ మేరకు లాలాపేట కార్తీక్‌ గార్డెన్‌ ఫంక్షన్‌ హాల్లో నిర్వహించిన తెలంగాణ ఓపెన్‌ చిల్డ్రన్స్‌ చెస్‌ టోర్నమెంట్‌-2025లో కార్యక్రమానికి కార్తీకరెడ్డి ముఖ్యతిథిగా పాల్గొని చెస్‌ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ట్రోఫీలను, బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రీడాకారులకు ఉజ్వలమైన భవిష్యత్‌ ఉందన్నారు. చదరంగం క్రీడ ద్వారా ఏకాగ్రత, విజ్ఞానం, వ్యూహాత్మకత వంటి నైపుణ్యాలు పెంపొందుతాయన్నారు. కార్యక్రమంలో స్థానిక బిజెపి నాయకులు వెంకటేష్‌గౌడ్‌, టీఎస్పీఏ సెక్రటరీ జయచంద్ర,చంద్రమౌళి, సంజయ్‌, శ్రీనివాస్‌, రాము వర్మ, దాదాపు 300 మంది క్రీడాకారులు తదితరులున్నారు.

రేపు పికెట్‌లో వాజ్‌పేయి విగ్రహావిష్కరణ



కంటోన్మెంట్‌: పికెట్‌ పార్కులో ఏర్పాటు చేసిన వాజ్‌పేయి విగ్రహావిష్కరణకు అడ్డంకులు తొలగిపోయాయి. రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌ సింగ్‌ చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి రంగం సిద్ధమైంది. బుధవారం ఉదయం పరేడ్‌ గ్రౌండ్‌లో నిర్వహించే తెలంగాణ విమోచన దినోత్సవాల్లో పాల్గొనేందుకు నగరానికి రానున్న రాజ్‌నాథ్‌ సింగ్‌, అనంతరం పికెట్‌ పార్కులో ఏర్పాటు చేసిన వాజ్‌పేయి విగ్రహావిష్కరణ చేయనున్నారు.

బీజేపీ నాయకుడు ఉమేష్‌ ఖండెల్వాల్‌ మృతి



బన్సీలాల్‌పేట్‌: బన్సీలాల్‌పేట్‌ డివిజన్‌ బీజేపీ మాజీ అధ్యక్షులు ఉమేష్‌ ఖండెల్వాల్‌(55) కన్నుమూశారు. ఆయనకు భార్య ఇద్దరు పిల్లలున్నారు. గత కొంత కాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న ఉమేష్‌ ఖండెల్వాల్‌ ఆరోగ్యం క్షీణించడంతో సోమవారం మరణించారు. ఉమేష్‌ మరణ వార్త తెలియగానే పెద్ద ఎత్తున బీజేపీ నాయకులు, కార్యకర్తలు వచ్చి ఉమేష్‌కు నివాళులర్పించారు.కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి, మాజీ గవర్నర్‌ బండారు దత్తాత్రేయ, సికింద్రాబాద్‌ పార్లమెంటరీ నియోజకవర్గం బీజేపీ కన్వీనర్‌ టి. రాజశేఖరరెడ్డి, మర్రి పురురవరెడ్డి, డివిజన్‌ అధ్యక్షులు మహేష్‌, వై. సురేష్‌కుమార్‌, హరినాథ్‌ నాయి, గుంటి సత్యనారాయణ తదితరులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

సనత్‌నగర్‌: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని బేగంపేట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన మేరకు.. బేగంపేట హర్షటిఫిన్‌ సెంటర్‌ సమీపంలోని డీటీడీసీ కొరియర్‌ సర్వీసు కార్యాలయం పక్కన ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు పోలీసులు 108 అంబులెన్స్‌ సిబ్బందితో అక్కడికి చేరుకుని సదరు వ్యక్తిని పరిశీలించారు. అయితే అప్పటికే అతను మృతి చెంది ఉన్నట్లు గుర్తించారు. మృతదేహాన్ని గాంధీమార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రేవంత్‌ రెడ్డి రాజీనామా చేయాలి



మారేడ్‌పల్లి తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న వివిధ సంఘాల నేతలు

అడ్డగుట్ట: అధికారంలోకి వచ్చిన వెంటనే పెన్షన్లు పెంచుతామని మాయ మాటలు చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని వీహెచ్‌పీఎస్‌ జాతీయ కోర్‌ కమిటీ చైర్మన్‌ గోపాల్‌ డిమాండ్‌ చేశారు. ఈ మేరకు సోమవారం విహెచ్‌పీఎస్‌, సీహెచ్‌పీఎస్‌, ఎమ్మార్పీఎస్‌ ఆధ్వర్యంలో మారేడ్‌పల్లి మండల కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్‌ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన ప్రకారం వికలాంగులకు 6వేలు, చేయుత పెన్షన్‌ దారులకు 4వేలకు వెంటనే పెన్షన్‌ పెంచాలని డిమాండ్‌ చేశారు. రేవంత్‌ రెడ్డి సర్కార్‌ అధికారంలోకి వచ్చి 21 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు వారికి పెన్షన్‌ పెంచలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు కొల్లి నాగేశ్వర్‌రావు, దయామణి, డప్పు మల్లికార్జున్‌, జోగు దశరథ్‌, పులిపాటి శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

పెండింగ్‌ ఫీజులు వెంటనే విడుదల చేయాలి

లాలాపేట: ఫీజు రీయింబర్స్‌మెంట్‌ బకాయిలతో ఇటు ప్రైవేట్‌ యాజమాన్యాలు.. అటు ప్రభుత్వం మధ్యలో గ్రామీణ పేద విద్యార్థులు నలిగిపోతున్నారని వెంటనే ప్రభుత్వం స్పందించి బకాయిలను విడుదల చేయాలి పీడీఎస్‌యూ(విజృంభణ) తెలంగాణ ప్రధాన కార్యదర్శి అల్లూరి విజయ్‌ అన్నారు. ఓయూ ఆర్ట్స్‌ కళాశాల ఎదుట మీడియాతో మాట్లాడుతూ.. విద్యారంగంలో సమూలమైన మార్పులు తీసుకువస్తామనీ అధికారంలోకి వచ్చి 22 నెలలు గడుస్తున్నా కాంగ్రెస్‌ ప్రభుత్వం మాటలు తప్ప చేసిందేమీ లేదన్నారు. విద్యా రంగానికి 7.3 శాతం నిధులు ఇచ్చి చేతులు దులుపుకుందనీ మండిపడ్డారు.



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ విజృంభణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లూరీ విజయ్‌

చెరువులను తలపించిన రోడ్లు



లాలాపేట: గత రాత్రి కురిసిన వర్షానికి తార్నాక మున్సిపల్‌ డివిజన్‌లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. తార్నాక, లాలాపేట, శాంతినగర్‌, మాణికేశ్వర్‌నగర్‌ తదితర ప్రాంతాల్లో మ్యాన్‌హోళ్లు పొంగిపొర్లాయి. కాలనీ, బస్తీ రోడ్లన్నీ చెరువులను తలపించాయి. తార్నాక నుంచి లాలాపేట విజయ డెయిరీకి వెళ్లే మార్గంలో ఫ్లెఓవర్‌ క్రింద దినమంతా భారీగా వరద నీరు పారింది. వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు.

22 నుంచి సెల్ట్‌లో నూతన కోర్సు ప్రారంభం

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్‌ కళాశాలలోని ద సెంటర్‌ ఫర్‌ ఇంగ్లీష్‌ లాంగ్వేజ్‌ ట్రెయినింగ్‌(సెల్ట్‌)లో ప్రత్యేకంగా ఇంటర్మీడియట్‌, పాఠశాల విద్యార్థుల కోసం ఈ నెల 22 నుంచి రెండు నెలల వ్యవధితో 'ఇంగ్లీష్‌ కమ్యూనికేషన్‌ స్కిల్స్‌ ఆండ్‌ పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌ ' అనే కోర్సును ప్రారంభిస్తున్నారు. తరగతులు సాయంత్రం 6 నుంచి 7-30 గంటల వరకు ఉంటాయి. ఈ కోర్సులో చేరదలిచిన వారు ఈ నెల 20వ తేదీ లోపు రిజిస్ట్రేషన్‌ చేసుకోవాలనీ సెల్ట్‌ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ సవీన్‌ సౌద సోమవారం తెలిపారు. వివరాల కోసం 7989903001 నెంబరుకు ఫోన్‌ చేయవచ్చు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం

లాలాపేట: నిత్య జీవితంలో యోగాను దినచర్యగా చేసుకోవడం ద్వారా మానసిక ఒత్తిడి దూరం కావడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చుననీ పలువురు వక్తలు పేర్కొన్నారు. ఈ మేరకు ఓయూ దూర విద్యా కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ ముగింపు కార్యక్రమంలో ప్రొఫెసర్‌ జి. రామ్‌రెడ్డి దూర విద్యా కేంద్రం డైరెక్టర్‌ ప్రొ భట్టాచార్యులు, జాయింట్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ సోమేశ్వర పోలా ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ యోగాసనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్‌ డా. జె. లలిత, విద్యా విభాగం అధ్యాపకులు డా. దుర్గేష్‌ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఓయూ దూర విద్యా కేంద్రం జాయింట్‌ డైరెక్టర్‌ ప్రొ. భట్టాచార్యులు

రోడ్డుపై విద్యుత్‌ స్తంభం తొలగింపు

సాక్షి ఎఫెక్ట్‌..

బన్సీలాల్‌పేట్‌: రోడ్డుపై విద్యుత్‌ స్తంభం కారణంగా ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగడంతో పాటు అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. బోయిగూడ ప్రధాన రహదారిలో పెట్రోల్‌ బంకు పక్కన రోడ్డుపై విద్యుత్తు స్తంభం కారణంగా రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ నెల 9న 'రోడ్డుపై స్తంభం...ప్రమాదాలకు నిలయం' అనే శీర్షికతో కథనం ప్రచురితమైయింది. దీంతో బేగంపేట్‌ సర్కిల్‌ జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి విద్యుత్తు స్తంభాన్ని తొలగించారు.



17న ప్రయాణికుల సేవా దినోత్సవం

సనత్‌నగర్‌: బేగంపేట విమానాశ్రయంలో ఈ నెల 17న ప్రయాణికుల సేవా దినోత్సవం జరుపుతున్నట్లు ఎయిర్‌పోర్ట్‌ జనరల్‌ మేనేజర్‌ కో-ఆర్డినేషన్‌ ఇన్‌చార్జి అచింత్‌ కుమార్‌దత్‌ తెలిపారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు మరపురాని జ్ఞాపకాలను అందించేలా వివిధ కార్యక్రమాలకు రూపకల్పన చేసినట్లు పేర్కొన్నారు. 'అమ్మ పేరుతో ఒక మొక్క' కార్యక్రమం ద్వారా పర్యావరణపై అవగాహనను పెంచుతున్నట్లు పేర్కొన్నారు. పిల్లలకు పెయింటింగ్‌ పోటీలతో పాటు పౌర విమానయాన రంగంలో అందుబాటులో ఉన్న ఉపాధి అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు. రక్తదాన శిబిరం, ఇంటరాక్టివ్‌ సెషన్లు ఉంటాయన్నారు. ప్రయాణికుల సౌలభ్యం, వారి సంతృప్తే ప్రథమ లక్ష్యమన్నారు.

గెస్ట్‌ ఫ్యాకల్టీకి దరఖాస్తుల ఆహ్వానం

సనత్‌నగర్‌: బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో పీజీ విద్యలో బోధించేందుకు గెస్ట్‌ ఫ్యాకల్టీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్‌ పద్మావతి తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఇంగ్లీష్‌, కామర్స్‌, పొలిటికల్‌ సైన్స్‌, హిస్టరీ, ఎకనామిక్స్‌, మ్యాథమెటిక్స్‌, బోటనీ, కెమిస్ట్రీ సబ్జెక్టులు బోధించేందుకు ఆయా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఈ నెల 17 లోపు అభ్యర్థులు తమ దరఖాస్తులను కళాశాల ఆవరణలో ఉన్న పీజీ బ్లాక్‌లో అందజేయాల్సి ఉంటుందన్నారు. 18 న ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన ఇటలీ జాగృతి అధ్యక్షుడు కిశోర్‌



లాలాపేట: తెలంగాణ జాగృతి ఇటలీ అధ్యక్షులు తానింకి కిషోర్‌ యాదవ్‌ సోమవారం ఎమ్మెల్సీ, జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు. అనంతరం కిషోర్‌ యాదవ్‌ మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో కవిత నాయకత్వంలో జాగృతిని మరింత బలోపేతం చేస్తామన్నారు. ప్రజా చైతన్య కార్యక్రమాలను సైతం నిర్వహిస్తుందన్నారు.

నేలకొరిగిన భారీ చెట్టు



చిలకలగూడ : సీతాఫల్‌మండి డివిజన్‌ శ్రీనివాసనగర్‌లో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి భారీ చెట్టు నేలకొరిగింది. శ్రీనివాసనగర్‌ ఫ్రైడేమార్కెట్‌ నాలా ప్రక్కన ఉన్న చెట్టు సోమవారం వేకువజామున కూకటివేళ్లతో నేలకొరిగి, నాలాపై పడడంతో నాలా ప్రహరీ ధ్వంసమైంది. ఈఘటనలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. కార్పొరేటర్‌ సామల హేమ, జీహెచ్‌ఎంసీ ఏఈ కౌశిక్‌లు సందర్శించారు. జీహెచ్‌ఎంసీ, డీఆర్‌ఎఫ్‌ బృందాలు సోమవారం ఉదయం రంగంలోకి దిగి చెట్టు కొమ్మలను తొలగించారు. ధ్వంసమైన నాలా ప్రహరీగోడకు మరమ్మత్తులు పనులు చేపట్టారు.

మధురానగర్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయండి



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో సమావేశమైన మధురానగర్‌ కాలనీ నాయకులు

సికింద్రాబాద్‌: సీతాఫల్‌మండి డివిజన్‌ మధురానగర్‌ కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు సోమవారం కేంద్రమంత్రి జీ.కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మచారి మహంకాళి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి నేతృత్వంలో పలువురు అసోసియేషన్‌ ప్రతనిధులు మంత్రి నివాసానికి వెళ్లి సమస్యలు వివరించారు. కాలనీ సభ్యుల వినతి మేరకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఎంపీ నిధుల ద్వారా మధురానగర్‌లో సీసీ కెమెరాల ఏర్పాటుకు హామీ ఇచ్చినట్టు తెలిపారు. సీసీ కెమెరాలతోపాటు కాలనీ సమస్యల పరిష్కారం కోసం సహకరించాలని వారు మంత్రిని కోరారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు రాజుసాగర్‌, ఈశ్వరయ్య, రాంరెడ్డి, సంజీవరెడ్డి, శ్రీధర్‌, ఎల్లయ్యగౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకోవాలి



విశ్వేశ్వరయ్యకు నివాళులర్పిస్తున్న దక్షిణ మధ్య రైల్వే ఇంజనీర్స్‌ అసోసియేషన్‌ నాయకులు

అడ్డగుట్ట: భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్యను నేటి తరం ఇంజనీర్లు ఆదర్శంగా తీసుకోవాలని దక్షిణ మధ్య రైల్వే ఇంజనీర్స్‌ అసోసియేషన్‌ నాయకులు పేర్కొన్నారు. ఆయన జయంతిని పురస్కరించుకొని సోమవారం దక్షిణ మధ్య రైల్వే ఇంజనీర్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించారు. అసోసియేషన్‌ నాయకులు మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య అందించిన విశిష్ట సేవలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. అనంతరం, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అదే విధంగా రైల్వేలో విశిష్ట సేవలు అందించిన ఇంజనీర్లను సన్మానించారు. నల్లా వెంకటేశ్వర్లు, అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి లోకేశ్వర్‌, మాజీ అధ్యక్షులు దీకొండ పద్మనాభం, జే.ఆర్‌. శ్రీనివాస్‌, శ్రీకాంత్‌, రవీందర్‌ తదితరులు పాల్గొన్నారు.

ఓయూకు సీఎం వస్తే అడ్డుకుంటాం

లాలాపేట: ఇటీవల ఉస్మానియా యూనివర్సిటీకీ వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి అనేక ప్రగల్భాలు పలికి ఇవాళ లక్షలాది మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ చెల్లించకుండా మోసం చేస్తున్నారని ఎంఎస్‌ఎఫ్‌ జాతీయ అధ్యక్షులు డాక్టర్‌ సోమశేఖర్‌, తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్‌ మాదిగలు అన్నారు. డిసెంబర్‌లో ఓయూ పర్యటనకు సీఎం రేవంత్‌రెడ్డి వస్తే తెలంగాణ విద్యార్థి లోకమంతా ఏకమై అడ్డుకుంటుందనీ హెచ్చరించారు. సోమవారం ఓయూలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణలోని దాదాపు 20 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకోవడానికి ఎమ్మార్పీఎస్‌ అధ్యక్షులు మంద కృష్ణమాదిగ నేతృత్వంలో విద్యార్థులు సిద్ధం అవుతున్నారనీ పేర్కొన్నారు. త్వరలో తెలంగాణ రాష్ట్ర ఎంఎస్‌ఎఫ్‌ కార్యవర్గ సమావేశం నిర్వహించి భవిష్యత్‌ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. సమావేశంలో ఎంఎస్‌ఎఫ్‌ నాయకులు డా. పి. సుధాకర్‌,మంద రాజు, ఎడెల్లి అజయ్‌,శ్యామ్‌ప్రసాద్‌, ఆదిత్య,ఉదయ్‌, అనీల్‌ తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఎంఎస్‌ఎఫ్‌ నాయకులు

ఆరు నెలల్లో భవనం పూర్తి కావాలి

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ దేవస్థానం ప్రాంగణం పాత కల్యాణ మండపం ప్రాంతంలో నిర్మించతలపెట్టిన భవన స్థలాన్ని కేంద్ర టూరిజం శాఖ అసిస్టెంట్‌ డైరెక్టర్‌ జనరల్‌ సోవన సారంగి సోమవారం పరిశీలించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్‌ హైమావతి, చైర్మన్‌ సాయిబాబాగౌడ్‌, పాల్గొన్నారు.

స్థానిక సమస్యలు నా దృష్టికి తీసుకురావాలి

బౌద్ధనగర్‌: వర్షాల ధాటికి ఎటువంటి సమస్యలు తలెత్తినా తన దృష్టికి తీసుకురావాలని కార్పొరేటర్‌ కంది శైలజ సూచించారు. ఆదివారం కురిసిన వర్షాలకు బౌద్ధనగర్‌లోని కౌసర్‌ మసీదు, ఏకశిల మెడికల్‌ హాల్‌, అంబర్‌ నగర్‌ తదితర లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈ సందర్భంగా సోమవారం స్థానిక కార్పొరేటర్‌ కంది శైలజ జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పర్యటించారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. ఈ పర్యటనలో డీఈఈ తిరుపతి, ఏఈ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

నాలా పరీవాహక ప్రాంతాల్లో పర్యటించిన డీసీ

చిలకలగూడ : సీతాఫల్‌మండి డివిజన్‌ పరిధిలో విస్తరించి ఉన్న నాలా పరీవాహక ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్‌ సామల హేమతో కలిసి జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్‌ ఆంజనేయులు సోమవారం పర్యటించారు. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి నాలా పరీవాహక, లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. ఆయా ప్రాంత ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రావద్దని డీసీ ఆంజనేయులు సూచించారు. శ్రీనివాసనగర్‌లోని భారీ చెట్టు కూలిన ప్రాంతాన్ని సందర్శించి, నాలా ప్రహరీగోడకు తక్షణమే మరమ్మత్తులు చేపట్టాలని ఇంజనీరింగ్‌ అధికారులను ఆదేశించారు.



నాలా పరీవాహక ప్రాంత ప్రజలతో మాట్లాడుతున్న డీసీ, కార్పొరేటర్‌

పెన్షన్‌లు పెంచాల్సిందే : ఎంఆర్‌పీఎస్‌

కంటోన్మెంట్‌: దివ్యాంగులు, వృద్ధులు, వితంతువుల, ఒంటరి మహిళ సహా ఇతరుల పెన్షన్‌లను పెంచాలని ఎమ్మార్పీఎస్‌ కంటోన్మెంట్‌ ఇంచార్జ్‌ ఇటుక శ్రీకిషన్‌ మాదిగ డిమాండ్‌ చేశారు. ఈ మేరకు వీహెచ్‌పీఎస్‌, సీహెచ్‌పీఎస్‌, ఎమ్మార్పీఎస్‌ నాయకులతో తిరుమలగిరి తహసీల్దార్‌ కార్యాలయాన్ని ముట్టడించారు. ఎమ్మార్పీఎస్‌ వ్యవస్థాపకులు, పద్మ శ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్‌, సీహెచ్‌పీఎస్‌, ఎమ్మార్పీఎస్‌ నాయకులు శ్రీకిషన్‌ మాదిగ, శ్రీనివాస్‌, మంద మధుకర్‌ మాదిగ, రేఖ మాదిగ పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్‌ నేతలు